నమస్తే తెలంగాణ

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 4 : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని, బీఆర్‌ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో జడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, నాయకులు ఏనుగు రాకేశ్‌రెడ్డి, మాదాసు వెంకటేశ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఊహించిన విధంగా సీట్లు, ఓటింగ్ రాలేదన్నారు. పోటా పోటీగా ఓటింగ్ నమోదైందన్నారు. ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పదవుల కోసం గొడవ పడితే అభివృద్ధి ఆగిపోతుందని, ప్రభుత్వాలు నిలకడగా ఉన్నప్పుడే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు, తెలంగాణలోని వనరులకు పొంతన లేదన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచకుంటే హామీలు నెరవేరవని కడియం స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో అధికారంలో ఉండాలంటే అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలను కలుపుకొని పోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చామని అహంకారంతో వ్యవహరిస్తే అడ్డంకులు ఏర్పడతాయని, ఐదేళ్లు ప్రభుత్వం నిలబడాలంటే నిజాయితీగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు.

### కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి..

పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని, ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని కడియం తెలిపారు. మూడు కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి సాధించారని, పారిశ్రామిక రంగాల అభివృద్ధి కోసం విద్యుత్ సమస్యను పరిష్కరించారని వివరించారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతులు పెరిగాయని, ప్రముఖ కంపెనీలను తెలంగాణను తీసుకొచ్చి ఉద్యోగావకాశాలను పెంచడం లో కేటీఆర్ కృషి విశేషంగా ఉందన్నారు. నాయకత్వం ఒకటిగా లేకుంటే నాగార్జునసాగర్ డ్యాం నుంచి కృష్ణా జలాల తరలింపుపై తెలుగు రాష్ట్రాల్లో గొడవలు జరుగుతాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ప్రణాళిక రూపొందించానని వివరించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 100 పడకల దవాఖానకు అనుమతులు వచ్చాయని, జీవో జారీ అయిందని తెలిపారు. తాను ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని కడియం తెలిపారు.

### కేసీఆర్ పథకాలతో పేదలకు మేలు..

అన్ని వర్గాలను ఆదుకునేందుకు కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశ చరిత్రలో మిగిలిపోతాయని ఏనుగు రాకేశ్ రెడ్డి, జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి 39 సీట్లు ఇచ్చి ప్రజలు గౌరవం అందించారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్‌ఎస్ శ్రేణులు నిరాశ పడాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, రాజేశ్ నాయక్, రాపోలు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు పల్లా, కడియం, పాడి

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో పోటీ చేసి ఎమ్మెల్యేలుగా ఘన విజయం సాధించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించగా, వారిని ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## కార్యకర్తలను కాపాడుకుంటా..

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**



నర్సంపేట, డిసెంబర్ 4 : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నేండ్లుగా తనతో నడిచిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. సామాన్య రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి వచ్చానని, నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. గొప్ప గొప్ప కార్యక్రమాలకు నర్సంపేట వేదిక అయిందన్నారు. ప్రజా తీర్పు ఎలా ఉన్నా నిత్యం ప్రజల కోసమే పని చేస్తానని, ప్రతి కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తనది, పార్టీది అని పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో మరింత ధైర్యంగా ముందుకు వెళ్తామన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు తనకు తోడుగా నిలిచిన కార్యకర్తలు, అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో నర్సంపేట ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నట్లు చెప్పారు.

## పదవి ఉన్నా, లేకున్నా ప్రజల మనిషినే..

- ఎవరూ అధైర్యపడొద్దు
- పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా..
- కార్యకర్తల్లో మనోధైర్యం నింపిన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : వరంగల్ పశ్చిమ ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని కార్యకర్తల్లో వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మనోధైర్యం నింపారు. సోమవారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. దాస్యం ఓటమిని జీర్ణించుకోలేని కొందరు మహిళా కార్యకర్తలు విలపించగా ధైర్యం చెప్పారు. పశ్చిమ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, 20ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో తనకు తోడున్న వారికి ధన్యవాదాలు తెలిపారు.



బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

## రుద్రేశ్వరస్వామికి లక్ష తులసీదళాలతో అర్చన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో సోమవారం 151 మంది శివభక్తులు సామూహిక రుద్రాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు లక్ష తులసీ దళాలతో అర్చన నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ప్రదోశకాల సమయంలో సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో కార్తీకపురాణ ప్రవచనాలు, భక్తమండళ్ల ఆధ్వర్యంలో భజనలు చేశారు. వేలాది మంది మహిళలు ఉసిరిక వృక్షాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు శివపంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.



రుద్రేశ్వరస్వామికి లక్ష తులసి ఆకులతో అర్చన చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ




**అమ్మవారికి పసుపుకొమ్ములతో అలంకరణ**

ఎస్ఆర్ఆర్ తోటలో దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు – కరీమాబాద్

## ప్రజల తీర్పును శిరసావహిస్తా..

- నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటా..
- రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, డిసెంబర్ 4 : నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు అండగా నిలిచి కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పరకాలను గడిచిన తొమ్మిదేండ్లలో అన్ని విధాలా అభివృద్ధి చేశానన్నారు. కేసీఆర్ ప్రత్యేక చొరవతో అత్యధిక నిధులు తెచ్చానని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పును శివసావహిస్తానని పేర్కొన్నారు. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు మడికొండ శ్రీను, దూరిశెట్టి చంద్రమౌళి, రాజ్‌కుమార్, జడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, సిలివేరు మొగిలి, నాయకులు సోదా రామకృష్ణ, రేవూరి విజయపాల్‌రెడ్డి, నిప్పాని సత్యనారాయణ, సారంగపాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి